

## మళ్లీ పెరిగిన పుత్తడి

న్యూఢిల్లీ, మే 2: బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లకు తోడు దేశీయంగా ఆభరణాలకు డిమాండ్ అధికంగా ఉండటంతో దేశీయంగా పుత్తడి ధర రూ.96 వేల మార్క్‌ను అధిగమించింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.1,080 ఎగబాకి రూ.96,800 పలికింది. గురువారం భారీగా తగ్గిన ధరలు మళ్లీ ఆ మరుసటి రోజే పెరగడం విశేషం. స్థానిక ఆభరణాల వర్తకులు కొనుగోళ్లకు మొగ్గుచూపడం, అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ అధికంగా ఉండటం ధరలు పెరగడానికి ప్రధాన కారణమని ట్రేడర్ వెల్లడించారు. పసిడితోపాటు కిలో వెండి రూ.1,600 ఎగబాకి రూ.97,100 పలికింది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 23.10 డాలర్లు పెరిగి 3,262.30 డాలర్లకు చేరుకోగా, వెండి 32.49 డాలర్లుగా ఉన్నది.

## ఆడీ కార్లు ప్రియం

న్యూఢిల్లీ, మే 2: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడీ ఇండియా మరోసారి ధరలను పెంచబోతున్నట్టు ప్రకటించింది. ఈ నెల 15 నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల మాడళ్ల ధరలను రెండు శాతం వరకు సవరిస్తున్నట్టు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఉత్పత్తి వ్యయం అధికం కావడంతోపాటు ఎక్స్చేంజ్ రేట్లలో మార్పులు చోటు చేసుకోవడం వల్లనే ధరలు పెంచాల్సి వచ్చిందని తెలిపింది.

## విక్రయదారులకు అమెజాన్ దన్ను

హైదరాబాద్, మే 2: దేశవ్యాప్తంగా ఉన్న చిన్న స్థాయి విక్రయదారులకు అమెజాన్ శుభవార్తను అందించింది. రూ.300 కంటే తక్కువ ధర కలిగిన ఉత్పత్తులపై రెఫరల్ ఫీజును పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో విక్రయదారులు తక్కువ ధర కలిగిన వస్తువులపై గణనీయమైన రీతిలో పొదుపు చేసుకునేందుకు అవకాశం లభించనున్నదని అమెజాన్ ఇండియా సేల్స్ డైరెక్టర్ గౌరవ్ భట్నాగర్ తెలిపారు. దుస్తులు, బూట్లు, ఫ్యాషన్ నగలు, గృహోపకరణాలు, వంటగదికి సంబంధించి 135కి పైగా రంగాలకు చెందిన ఉత్పత్తులకు ఈ నిర్ణయం వర్తించనున్నది. తెలంగాణ నుంచి 50 వేల మంది విక్రయదారుల నుంచి సేకరించి తమ ఉత్పత్తులను అమెజాన్‌లో విక్రయిస్తున్నాయి.

# వృద్ధికి టారిఫ్ దెబ్బ

**ఈ ఆర్థిక సంవత్సరానికిగాను జీడీపీ అంచనాను తగ్గించిన ఎస్అండ్‌పీ**

- *6.5 శాతం నుంచి 6.3 శాతానికి కోత*
- *ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రభావం*
- *ఈ ఏడాది ఆఖరుకల్లా 88 స్థాయికి రూపీ పతనం!*




న్యూఢిల్లీ, మే 2: భారత జీడీపీ అంచనాలకు ప్రముఖ గ్లోబల్ రేటింగ్స్ ఏజెన్సీ ఎస్అండ్‌పీ కోత పెట్టింది. ఈ ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను దేశ వృద్ధిరేటు 6.3 శాతంగానే ఉండొచ్చని శుక్రవారం పేర్కొన్నది. ఇంతకుముందు అంచనా 6.5 శాతంగా ఉండటం గమనార్హం. 'ప్రపంచ స్థూల ఆర్థిక వ్యవస్థ సమాచారం: ఆర్థిక వృద్ధిని నెమ్మదింపజేస్తున్న అమెరికా వాణిజ్య విధానంలోని భారీ మార్పులు' పేరిట ఓ నివేదికను ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ తాజాగా విడుదల చేసింది. ఈ సందర్భంగానే గతంలో భారత ఆర్థిక వ్యవస్థ ప్రగతికి సంబంధించి పేర్కొన్న అంచనాలను సవరించింది.

### ట్రంప్ సుంకాల సెగ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలకు తెరలేపడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఒక్కసారిగా అలజడి మొదలైంది. అయితే చైనా మినహా మిగతా దేశాలపై విధిస్తామన్న టారిఫ్‌లను తాత్కాలికంగా నిలిపివేయడం కొంతలోకొంత ఊరటనిచ్చింది. ఈ క్రమంలోనే భారత్‌సహా ఆయా దేశాలు.. అమెరికాతో వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకునే పనిలోపడ్డాయి. అయినప్పటికీ ఈ ట్రేడ్ వార్‌పై అనిశ్చిత పరిస్థితులు ఇంకా కొనసాగుతూనే ఉండటంతో.. ఆ సెగ ఇప్పుడు దేశ జీడీపీ అంచనాకు తాకింది. నిజానికి ఈ ఏడాది మార్చిలోనే దేశ వృద్ధిరేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 6.5 శాతంగానే ఉండొచ్చని ఎస్అండ్‌పీ అంచనా వేసింది. అంతకు ముందు ఇది 6.7 శాతంగా ఉంటుందన్నది. ఈ నేపథ్యంలో ఇప్పుడు మరో 0.2 శాతం మేర తగ్గొచ్చని ప్రకటించింది. ఈ లెక్కన చూసుకుంటే జీడీపీ అంచనాకు దాదాపు అర శాతం కత్తెర పడినట్టే అనుకోవచ్చు. ఇక వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) దేశ జీడీపీ వృద్ధిరేటు 6.5 శాతంగా ఉండొచ్చని ఎస్అండ్‌పీ అంటున్నది.

### రూపాయి అధోగతే..

డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ ఏడాది ఆఖరుకల్లా 88 స్థాయికి దిగజారవచ్చని ఎస్అండ్‌పీ ఈ సందర్భంగా తమ రిపోర్టులో పేర్కొన్నది. ప్రస్తుతం 84.57 వద్ద రూపీ వాల్యూ కదలాడుతుండగా.. 2024 చివర్లో 85.64 వద్ద ఉన్న విషయం తెలిసిందే. దీంతో ఈ ఏడాది మొదలు ఇప్పటి దాకానైతే రూపాయి మారకం విలువ రూపాయికిపైగానే కోలుకున్నట్టు కనిపిస్తున్నది. అయితే గడిచిన ఈ 4 నెలల్లో తీవ్ర ఒడిదొడుకులనూ చవిచూసింది. ఫిబ్రవరి 6న మునుపెన్నడూ లేనివిధంగా 87.59 స్థాయికి క్షీణించింది. ఒకానొక దశలో 87.60 స్థాయినీ తాకింది. ఈ నేపథ్యంలో ఎస్అండ్‌పీ అంచనా మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. మళ్లీ రూపాయి ఒత్తిడికి లోనవబోతున్నదన్న సంకేతాలనిస్తున్నది.

**2025-26కుగాను దేశ జీడీపీ అంచనాలకు కోతలు**

| సంస్థ | ప్రస్తుతం | మునుపు |
|---|---|---|
| ఆర్బీఐ | 6.5% | 6.7% |
| ఫిచ్ | 6.4% | 6.5% |
| ఓఈసీడీ | 6.4% | 6.9% |
| ఎస్అండ్‌పీ | 6.3% | 6.5% |
| ప్రపంచ బ్యాంక్ | 6.3% | 6.7% |
| ఐఎంఎఫ్ | 6.2% | 6.5% |
| మూడీస్(2025) | 6.1% | 6.4% |

- **ఈ ఏడాది అమెరికా జీడీపీ వృద్ధిరేటు 1.5 శాతంగా, వచ్చే ఏడాది 1.7 శాతంగా ఉండొచ్చంటున్న ఎస్అండ్‌పీ.**
- **చైనా జీడీపీ వృద్ధిరేటు ఈ ఏడాది 0.7 శాతం తగ్గి 3.5 శాతానికే పరిమితం కావచ్చు. వచ్చే ఏడాదైతే 3 శాతంగానే ఉండొచ్చని అంచనా.**
- **అమెరికాతో సుంకాల సమరానికి బదులుగా చాలా దేశాలు వాణిజ్య ఒప్పందాలనే చేసుకునే వీలుందంటున్న ఎస్అండ్‌పీ.**
- **అమెరికా, యూరప్ దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు సంక్లిష్టం కావచ్చు. కఠిన వైఖరికే మొగ్గుచూపుతున్న కెనడా.**
- **పరస్పర ప్రతీకార సుంకాలతో ఏ దేశానికీ లాభం ఉండదంటున్న ఎస్అండ్‌పీ. ఈ తరహా రక్షణాత్మక ధోరణులు మంచివికావని హితవు.**



## టాప్‌గేర్‌లో క్రెటా విక్రయాలు

న్యూఢిల్లీ, మే 2: ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన హ్యుందాయ్‌కు చెందిన ఎస్‌యూవీ మాడల్ క్రెటా మరో మైలురాయిని సాధించింది. వరుసగా రెండో నెల ఏప్రిల్‌లోనూ అత్యధికంగా అమ్ముడైన వాహనాల్లో తొలిస్థానంలో నిలిచింది. గత నెలలో 17 వేల యూనిట్ల క్రెటా వాహనాలు అమ్ముడయ్యాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో అమ్ముడైన దాంతో పోలిస్తే 10 శాతం వృద్ధిని కనబరిచాయి. సంస్థ మొత్తంగా 69,914 యూనిట్ల వాహనాలను విక్రయించగా, వీటిలో ఎస్‌యూవీ వాటా 71 శాతంగా ఉన్నదని పేర్కొంది. ఈ వాహనంపై కస్టమర్లు పెట్టుకున్న నమ్మకానికి ఇది నిదర్శనమని కంపెనీ సీవోవో, డైరెక్టర్ తరుణ్ గార్గ్ తెలిపారు. క్రెటాతోపాటు వెన్యూ, ఎక్స్‌టర్, అల్కాజర్, ఇతర మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది. పదేండ్ల క్రితం దేశీయ రోడ్లపైకి అందుబాటులోకి వచ్చిన ఈ మాడల్‌కు 12 లక్షల మంది కస్టమర్లు ఉన్నారు.

## అమెరికాలో మేడ్ ఇన్ ఇండియా ఐఫోన్లు

- **యాపిల్ సీఈవో టిమ్ కుక్ వెల్లడి**



న్యూఢిల్లీ, మే 2: అమెరికాలో అమ్ముడుకానున్న ఐఫోన్లలో భారత్‌లో తయారైనవే అత్యధికంగా ఉండనున్నాయని యాపిల్ సీఈవో టిమ్ కుక్ వెల్లడించారు. వరుసగా ఏడో త్రైమాసికంలోనూ చైనాలో ఐఫోన్ల అమ్మకాలు తగ్గుముఖం పట్టడంతో సంస్థ ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించింది. ఒకవైపు ప్రతీకార సుంకాలు విధిస్తుండటంతో భారత్‌లో తయారవుతున్న ఐఫోన్లను భారీగా దిగుమతి చేసుకోవాలని చూస్తున్నది సంస్థ. జూన్ త్రైమాసికం నాటికి యూఎస్‌లో అమ్ముడుకానున్న అత్యధిక ఐఫోన్లలో భారత్ నుంచి దిగుమతి చేసుకునేవే ఉండనున్నాయని, అలాగే వియత్నాం నుంచి ఐప్యాడ్, మ్యాక్, యాపిల్ వాచెస్, ఎయిర్‌ప్యాడ్స్ ఉండనున్నాయని చెప్పారు. 2024లో అమెరికాలో 75.9 మిలియన్ల ఐఫోన్లు అమ్ముడయ్యాయి. ఇప్పటికే యునైటెడ్ స్టేట్స్‌కు భారత్ నుంచి అత్యధికంగా ఐఫోన్లు ఎగుమతి అవుతున్నాయని, ఫిబ్రవరితో ముగిసిన మూడు నెలలకాలంలో ఎగుమతులు 82 శాతం పెరిగాయని, ఇదే క్రమంలో మార్చి నాటికి 97.6 శాతానికి చేరుకున్నాయని ఎస్అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటిలిజెన్స్ తన నివేదికలో వెల్లడించింది. మార్చితో ముగిసిన రెండో త్రైమాసికంలో కంపెనీ ఆదాయం 90.75 బిలియన్ డాలర్ల నుంచి 95.35 బిలియన్ డాలర్లకు చేరుకున్నది.



## కోలుకున్న స్టాక్ మార్కెట్లు

### సెన్సెక్స్ 260, నిఫ్టీ 12 పాయింట్ల లాభం

ముంబై, మే 2: దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా లాభపడ్డాయి. అమెరికా-భారత్ దేశాల మధ్య వాణిజ్య ఒప్పందాలు కుదిరే అవకాశాలుండటం, రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లుకావడం మదుపరులను కొనుగోళ్ల వైపు నడిపించాయి. వీటికి తోడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు ఎగబడి కొనుగోళ్లు జరపడం, అంతర్జాతీయ మార్కెట్లు ఆశాజనకంగా ట్రేడవడంతో సూచీలకు ఉత్సాహాన్ని ఇచ్చింది. ఇంట్రాడేలో 900 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 259.75 పాయింట్లు అందుకొని 80,501.99 వద్ద ముగియగా, మరో సూచీ నిఫ్టీ 12.50 పాయింట్లు పెరిగి 24,346.70 పాయింట్లకు చేరుకున్నది. ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో అదానీ పోర్ట్ షేరు 4 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు బజాజ్ ఫైనాన్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎస్బీఐ, మారుతి, టాటా మోటర్స్, ఐటీసీ, టాటా స్టీల్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు లాభాల్లో ముగియగా..నెస్లె, ఎన్‌టీపీసీ, కొటక్ మహీంద్రా బ్యాంక్, పవర్‌గ్రిడ్, టైటాన్ షేర్లు నష్టపోయాయి. రంగాలవారీగా సర్వీసెస్ 1.67 శాతం అధికంకాగా, ఆయిల్ అండ్ గ్యాస్, ఎనర్జీ, ఐటీ రంగ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించగా..టెలికం, కన్జ్యూమర్ డ్యూరబుల్, పవర్, యుటిలిటీ, మెటల్, రియల్టీ రంగ షేర్లు నష్టపోయాయి.

## సర్కారీ అప్పులు తగ్గాలి

- **అప్పుడే దేశ క్రెడిట్ రేటింగ్ జూమ్**
- **డీఈఏ కార్యదర్శి అజయ్ సేథ్**

న్యూఢిల్లీ, మే 2: దేశ రుణ భారం చాలా ఎక్కువగా ఉందని, ఇది తగ్గాలని.. అప్పుడే గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీలు భారత క్రెడిట్ రేటింగ్‌ను పెంచుతాయని ఆర్థిక వ్యవహారాల (డీఈఏ) కార్యదర్శి అజయ్ సేథ్ అన్నారు. ఈ సర్కారీ అప్పులపై చెల్లించే వడ్డీ భారం కూడా మోయలేనివిధంగా తయారవుతున్నదని, దాన్ని దించుకోవాల్సిన అవసరం ఎంతో ఉన్నదనీ ఆయన అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఐఎస్‌ఏపీసీ సెంటర్ ఫర్ పబ్లిక్ పాలసీ కాన్ఫరెన్స్‌లో అజయ్ మాట్లాడుతూ.. అప్పులు పెరుగుతూపోవడం మంచిదికాదన్నారు. రేటింగ్ అప్‌గ్రేడ్ కోసం రేటింగ్ ఏజెన్సీలతో భారత్ ఎప్పటికప్పుడు సంప్రదింపులు చేస్తోందని వివరించారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడానికి మితిమీరిన రుణ భారమేనంటూ వ్యాఖ్యానించారు. అలాగే ఖర్చులకు సంబంధించి స్పందిస్తూ.. చాలావరకు సమతూకం లోపించిందన్నారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాభివృద్ధి కంటే రుణ నిధులను వ్యయాలను పెంచుకోవడానికే వినియోగిస్తున్నాయన్నారు. కాగా, ట్యాక్స్-టు-జీడీపీ రేషియో 20 శాతానికి చేరాలంటే 5-6 ఏండ్లు పట్టవచ్చన్నారు.

## బ్యాంకులపై ఆర్బీఐ భారీ జరిమానా

ముంబై, మే 2: నాలుగు బ్యాంకులకు రిజర్వు బ్యాంక్ షాకిచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందుకుగాను ఐసీఐసీఐ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాతోపాటు మరో రెండు బ్యాంకులపై భారీ స్థాయిలో జరిమానా విధించింది. వీటిలో ఐసీఐసీఐ బ్యాంక్‌పై రూ.97.80 లక్షలు, బ్యాంక్ ఆఫ్ బరోడాపై రూ.61.40 లక్షలు, ఐడీబీఐ బ్యాంక్‌పై రూ.31.8 లక్షలు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రపై రూ.31.80 లక్షల చొప్పున విధించింది. కేవైసీ నిబంధనలు పట్టించుకోకపోవడం, సైబర్ సెక్యూరిటీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వల్లనే జరిమానా విధించింది.

## రామగిరిలో బంద్ ప్రశాంతం

రామగిరి, మే 2: పహల్గాం ఘటనకు నిరసనగా బీజేపీ, అనుబంధ వీహెచ్‌పీ ఆధ్వర్యంలో తలపెట్టిన రామగిరి మండల బంద్ శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేసి బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. బీజేపీ మండలఅధ్యక్షుడు కొండు లక్ష్మణ్ కార్యకర్తలతో కలిసి పట్టణంలో తిరుగుతూ బంద్‌ను సమీక్షించారు. హిందువులంతా ఏకతాటిపైకి వచ్చి ఇతర మతాల దాడులను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు తొట్ల రాజు, బీజేపీ నాయకులు కొత్త కమలాకర్, ఇరుగురాల సంపత్, వెంకటేష్, చిదురాల శివ, గసిరెడ్డి నాగరాజు, రేణిగుంట్ల విజయ్, నరేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## రౌండ్ టేబుల్ సమావేశానికి తరలిరావాలి

రామగిరి, మే 2: తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భవిష్యత్ కార్యచరణ నిమిత్తం ఈనెల 4వ తేదీన కరీంనగర్ జిల్లా కేంద్రంలో తలపెట్టిన ఉమ్మడి జిల్లా రౌండ్ టేబుల్ సమావేశంకు రామగిరి మండలం నుంచి ఉద్యమకారులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు నూనె రాజేశం, ముదిరాజ్ మహిళా విభాగం అధ్యక్షురాలు పోతు జ్యోతిరెడ్డి, ఉత్తర తెలంగాణ కన్వీనర్ బత్తుల శంకర్, కళాధర్ రెడ్డి, మండల అధ్యక్షులు నూనె మల్లేశ్వరి, దాసరి రామస్వామి, కొలిపాక రాజలక్ష్మీలు కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను జూన్ 2వ తేదీలోగా అమలు చేయాలని లేనిపక్షంలో ప్రభుత్వ మోసపూరిత విధానాలను ఎండగడుతూ ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందన్నారు.

## కాకర్లపల్లిలో డీఎల్‌పీవో పర్యటన

మంథని రూరల్, మే2: మండలంలోని కాకర్లపల్లి గ్రామంలో డీఎల్‌పీవో సతీష్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని డ్రైనేజీలను, హరిత హారం మొక్కలను, సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాన్ని పరిశీలించారు. గ్రామంలో ఎప్పటికప్పుడు పరిశుభ్రతను పాటించాలని సూచించారు. గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు.ఆయన వెంట ఎంపీవో శేషయ్య సూరి, కార్యదర్శి జ్యోత్స్నరాణిలు ఉన్నారు.

## మోడల్ స్కూల్ విద్యార్థులకు అభినందన



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

అంతర్గాం, మే 2: ఇటీవల పదో తరగతి పరీక్షా ఫలితాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన 34 మంది విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ సదానందం అభినందించారు. ఈమేరకు శుక్రవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో 500లకు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యా యులకు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జే.శ్రీనివాస్, ఎం.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆది శంకరాచార్యుల జయంతి ఉత్సవాలు

మంథని, మే2: భారతదేశంలో సనాతన ధర్మం గురించి ప్రభోదించిన శ్రీ ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలను మంథని పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ శీలేశ్వర సిద్ధేశ్వర స్వామి దేవాలయంలోని శ్రీ ఆది శంకరాచార్యుల ఆలయంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత ఐదు రోజులుగా స్వామివారికి నిత్య రుద్రాభిషేకం నిర్వహిస్తూ భక్తుల శ్రీ సూక్తం, నమ్మకం,చమకం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పట్టణంలోని పుర వీధుల గుండా భక్తులు శోభాయ యాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## ఆర్జీ-1డివిజన్‌లో 51శాతం బొగ్గు ఉత్పత్తి

- **బొగ్గు ఉత్పత్తి తగ్గుదలకు అనేక కారణాలు**
- **ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్**



మాట్లాడుతున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని, మే 2: సింగరేణిలో 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి నెల ఏప్రిల్‌లో ఆర్జీ-1 డివిజన్‌ల్లో కేవలం 51శాతం బొగ్గు ఉత్పత్తి జరిగిందని ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ వెల్లండించారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తెలిపారు. ఏప్రిల్‌లో 4,06,400 టన్నుల లక్ష్మానికి 2,06,439 టన్నుల బొగ్గు ఉత్పత్తితో 51శాతం సాధ్యమైందన్నారు. ఓపెన్‌కాస్ట్ 5 నుంచి 3లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి గాను 1,47064 టన్నులు (49 శాతం) వెలికి తీసినట్లు తెలిపారు. ఓసీపీలో షావల్స్ సమస్యతో పాటు బొగ్గు ఉత్పత్తిపై కప్పబడి ఉండే ఓవర్ బర్డెన్ మట్టి వెలికితీత పనులు నెమ్మదించడం వల్ల బొగ్గు ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడిందని వివరించారు. రానున్న రోజుల్లో బొగ్గు ఉత్పత్తి పెంచడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి కార్మికులకు మంచినీటి సరఫరా ఇబ్బందులు ఏర్పడకుండా గోదావరి నది వద్ద చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇక్కడ ఎస్వోటు జీఎం గోపాల్‌సింగ్, ఏరియా ఇంజినీర్ డీవి రావు, ఎస్‌సీఎంవో డాక్టర్ అంబిక, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, సివిల్ వరప్రసాద్, పర్సేస్ జీఎం జితేందర్‌సింగ్, డీజీఎం భీమా, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సీనియర్ పీవో హన్మంత రావు ఉన్నారు.

**219శాతం ఉత్పత్తితో రికార్డు సృష్టించిన ఆర్జీ-2**

2025-26 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ మొదటి నెల ఏప్రిల్‌లో 98శాతం బొగ్గు ఉత్పత్తి సాధించింది. 72 మిలియన్ టన్నుల భారీ ఉత్పత్తి లక్ష్యసాధనతో ముందుకు సాగుతున్న సింగరేణి సంస్థ ఏప్రిల్ నెలలో 52,78,300 టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి గాను 51,72,127 టన్నులతో 98శాతం సాధించింది. రామగుండం డివిజన్ 2 ఏప్రిల్ నెలలో 2,28,400 టన్నులకు గాను 4,00,986(219శాతం) సాధించి రికార్డు సృష్టించింది. మణుగూరు డివిజన్ 117శాతం, కొత్తగూడెం 93శాతం, శ్రీరాంపూర్ 92శాతం, రామగుండం డివిజన్3 (89శాతం), అడ్రియాల ప్రాజెక్టు 84శాతం, ఇల్లందు 82శాతం, బెల్లంపల్లి 78శాతం, మందమర్రి, భూపాలపల్లి 70శాతం, రామగుండం డివిజన్1 (51శాతం) సాధించినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. కొన్ని ఏరియాల్లో బొగ్గు ఉత్పత్తి గణనీయంగా తగ్గడం, వల్ల ఏప్రిల్ నెలలో నిర్దేశిత లక్ష్యాన్ని సాధించలేకపోయినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

## బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

పెద్దపల్లి రూరల్, మే2: పెద్దపల్లి మండలంలోని సబ్బితంలో గ్రామపంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్న యేడెల్లి నర్సయ్య(53) శుక్రవారం గ్రామపంచాయతీ పనులు ముగిసన తర్వాత సైకిల్ వేసుకుని రోడ్డు దాటుతున్న క్రమంలో పెద్దపల్లి నుంచి మంథని వైపు వెళతున్న ఇసుక లారీ వేగంగా సైకిలిస్టును ఢీ కొట్టింది. ఈ ఘటనలో సైకిల్‌తో రోడ్డు దాటుతున్న నర్సయ్య లారీ టైర్ కింద పడి తీవ్రగాయాల పాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి చేరుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ పోలీసులకు మొర పెట్టుకున్నారు. రోడ్డప్రమాద ఘటన విషయం తెలుసుకున్న బసంత్‌నగర్ ఎస్ఐ కె.స్వామి ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. 25 ఏళ్లుగా గ్రామపంచాయతీ కార్మికునిగా గ్రామానికి, ప్రజలకు నర్సయ్య చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ అందరితో మంచిగా ఉంటూ పంచాయతీ సేవలు అందించిన బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు పెద్దపల్లి, బసంత్‌నగర్ పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నారు. మృతునికి భార్య, కొడుకు ఉండగా భార్య అనారోగ్యంతో మంచాన పడింది.

## వృద్ధుడి బలవన్మరణం

మానకొండూర్, మే 2: మండలంలోని పోచంపల్లి గ్రామానికి పొలం పోచాలు (76) జీవితంపై విరక్తి చెంది ఉరేసుకుని బలవన్మరణం చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోచాలు కొంత కాలంగా కడుపునొప్పి, ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. ఎన్ని దవాఖానలు తిరిగినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించారు. పోచాలుకు భార్య తోపాటు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవ్ తెలిపారు.

## ప్రభుత్వ చీఫ్ సెక్రటరీని కలిసిన ఎమ్మెల్యే

గోదావరిఖని, మే 2: రాష్ట్ర ప్రభుత్వ నూతన చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన సీనియర్ ఐఏఎస్ అధికారి రామకృష్ణరావును శుక్రవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మర్యాద పూర్వకంగా కలిశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్‌లో చీఫ్ సెక్రటరీని కలిసిన ఎమ్మెల్యే శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభకాంక్షలు తెలిపారు.

## 6న జాబ్ మేళా..

పెద్దపల్లి కమాన్, మే 2 : జిల్లాలోని నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు కల్పిం చేందుకు ఈ నెల 6న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై. తిరుపతిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేడ్చల్‌లోని కేఎల్ గ్రూప్ సర్వీసెస్‌లో ఖాళీగా ఉన్న 50 వేర్ హౌసింగ్ అసోసియేట్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించి, 18-35 ఏళ్ల వయస్సున్న వారు అర్హులని చెప్పారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు మంగళవారం ఉదయం 11 గంటలకు పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లోని రూమ్ నెం. 225లో సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో ఇచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 6309518695, 7093172221, 7093172221 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

## విధుల నుంచి తొలగించాలి

ఫర్టిలైజర్‌సిటీ, మే 2: క్రైస్తవుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన ఆర్టీసీ ప్రైవేట్ సెక్యూరిటీగార్డు అమరేందర్‌ను విధుల నుంచి తొలగించాలని రామగుండం నియోజకవర్గ యూనైటెడ్ చర్చి పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తిమోతి పాల్, ప్రధానకార్యదర్శి నిరీక్షణ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గోదావరిఖని ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. బెల్లంపల్లికి చెందిన దుర్గం ప్రసాద్ గురువారం గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్‌లో క్రైస్తవ సువార్తా కరపత్రాలను పంపిణీ చేయగా, బస్టాండ్‌లో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీగార్డు అమరేందర్ అడ్డుపడి, దుర్భాషలాడాడని, దాడికి యత్నించాడని ఆరోపించారు. ఇక్కడ నవీన్, శ్యామ్‌సన్, డీ ప్రభాకర్, అబ్రహం, జోసఫ్, జాన్సన్, డానియల్ మలాకి ఉన్నారు.

## పెద్దపల్లి రిక్రియేషన్ క్లబ్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసుల మెరుపు దాడి

- **పోలీసుల అదుపులో 20మంది బడా వ్యాపారులు, ప్రజాప్రతినిధులు**
- **మరో 35మంది పరారీ**

పెద్దపల్లి టౌన్, మే 2: పెద్దపల్లి అమర్‌చంద్ కళ్యాణ మండపం ఆవరణలోని రిక్రియేషన్ క్లబ్‌పై శుక్రవారం రాత్రి హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపు దాడి చేశారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన బడా వ్యాపారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు న్యాయవాదులు, జర్నలిస్టులు, ఉద్యోగులు దాదాపు రోజు 50 మంది వరకు రిక్రియేషన్ క్లబ్‌లో పేకాడుతూ రూ.25లక్షల నుంచి రూ.50లక్షల వరకు టెబుల్ నడుస్తుందనే పుకార్లు ఉన్నాయి. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి 20మందిని అదుపులోకి తీసుకోగా, 35మంది పారిపోయారు. వీరి వద్ద నుంచి దాదాపు రూ.20లక్షల నుంచి రూ.30 లక్షలు రికవరీ చేసినట్లు స్థానికులు తెలిపారు. నిత్యం రిక్రియేషన్ క్లబ్‌లో కొంత మంది పోలీసుల అండదండలతోనే పెద్దఎత్తున పేకాట ఆడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. క్లబ్‌పై దాడి విషయం చెప్పేందుకు పోలీసులు నిరాకరిస్తున్నారు.

## నేత్ర, అవయవదానానికి దంపతుల అంగీకారం



ప్రశంసాపత్రం అందజేస్తున్న సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు

కోల్‌సిటీ, మే 2: గోదావరిఖని మార్కండేయ కాలనీకి చెందిన సింగరేణి కాంట్రాక్టర్ కట్ల లక్ష్మీనారాయణ, అతని భార్య ప్రభుత్వ ఉపాధ్యాయురాలు స్వరూప శుక్రవారం తమ కుమార్తె శ్రీమేధ పుట్టిన రోజున గొప్ప నిర్ణయం తీసుకున్నారు. తమ మరణానంతరం నేత్ర, అవయవదానం చేసేందుకు అంగీకారం తెలిపారు. వారి స్వగృహంలో జరిగిన పుట్టిన రోజు వేడుకలకు గోదావరిఖని ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి పందిళ్ల శ్యాంసుందర్, సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, ప్రచార కార్యదర్శి వాసులు హాజరై ఆ దంపతులకు అంగీకార పత్రాలను అందజేసి అభినందించారు. ఆ దంపతులు తీసుకున్న నిర్ణయం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయమన్నారు. కార్యక్రమంలో సదాశయ సభ్యులు రాములు. సరోజన, మగువ లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు శశికళ, సదాశయ సభ్యులు నాగుల శంకర్, సుదర్శన్, దబ్బెట శంకర్, కుటుంమ సభ్యులు సమ్మక్క, చంద్రశేఖర్, స్రవంతి, సాహితీ, ప్రవీణ్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కుంట బుడుగులో చిక్కుకుని మత్స్యకారుడి మృతి

శంకరపట్నం, మే 2: చేపలు పట్టేందుకు వెళ్లిన మత్స్యకారుడు బుడుగులో చిక్కుకుని మృతి చెందిన విషాదకర ఘటన మెట్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మెట్‌పల్లి గ్రామంలో మత్స్యకార కుటుంబానికి చెందిన దంపతులు కొల్లూరి చంద్రమౌళి-సరమ్మ శుక్రవారం మధ్యాహ్నం గ్రామ శివారులోని చింతకుంటలోకి చేపలు పట్టేందుకు వెళ్లారు. చంద్రమౌళి కుంటలోకి దిగగా భార్య సరమ్మ గట్టున కూర్చుంది. కుంటలోకి దిగిన చంద్రమౌళి బుడుగులో కూరుకుపోయి బయటకు రాలేక ఇబ్బంది పడడం చూసిన సరమ్మ వెంటనే కేకలు వేయగా, సమీపంలో ఉన్న ఓ వ్యక్తి రాగా చీర వేసి బయటకు లాగే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే బుడుగులో చిక్కొని నీట మునిగి ఊపిరి ఆడక మృతి చెందాడు. చంద్రమౌళి (60) వివాహమైన కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న కేశవపట్నం ఎస్ఐ సిబ్బందితో కుంట వద్దకు వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలిస్తున్నట్లు తెలిపారు.